# రేపటి దీపాలు

-రసరాజు

ఉమేష్ – యువతరాన్ని ఊపేస్తున్న కథా నాయకుడు.

అతని హెయిర్ స్టయిలే అద్భుతంగా ఉంటుంది.

కోలగా ఉండే ముక్కు...

కళ్లల్లో చిలిపితనం...

నడకలో నాజూకు...

ఎప్పుడూ నవ్వుతుండే పెదాలు...

ఎర్రటి ముఖం...

"ఓహ్! అందగాడంటే అతడే..." అంటారు అతణ్ని ఆరాధించేవాళ్లు. అభిమాన సంఘాలు అతనికెప్పుడో "వెండితెర వేల్పు" అనే బిరుదు ఇచ్చేశాయి.

ఊరూ వాడా – అతని అడుగుజాడల్ని కళ్ల కద్దు కొంటున్నాయి.

అతని బొమ్మతో వాల్‌పోస్టర్ పడిందంటే చాలు – హారతులిచ్చే అందమైన అమ్మాయిలున్నారు.

అతని కటౌట్ వెలసిందంటే చాలు – గజమాలలతో అలంకరించే శ్రీమతుల బిడ్డలున్నారు.

అతని సినిమా విడుదలయితే చాలు – శివకాశిలో సిద్ధంగా వున్న బాణాసంచా అంతా అక్కడే దీపావళి జరుపుకొంటుంది. పుల్లారెడ్డి మిఠాయిలన్నీ అక్కడే వసంతం చేసి కొంటాయి. అంత "క్రేజ్" ఉంది – ఆ హీరో అంటే.

ఉమేష్ – ముఖ్యంగా కాలేజీ అమ్మాయిల పుస్తకాల అట్టలపైనే కాకుండా అంతరంగాల్లో సైతం కొలువుండే ఆరాధ్యదైవం. అటువంటి "దైవం" సరసన కూర్చో వటమా...

ఎంత థ్రిల్...

పైగా – అతనితో ముచ్చట్లు...

ఎంత మజా...

బాపురే! తలుచుకొంటేనే పిచ్చెక్కిపోతుంది.

రేపే – రేపే – ఆ స్వర్ణావకాశం కళ్ల ముందు సాక్షాత్కరించబోతోంది.

ఈ రాత్రి గడిస్తే చాలు – ఆ స్వర్గమే నేల మీదికి దిగి వస్తుంది.

"అమ్మాయిల మధ్య అభిమాన హీరో" అనే కార్యక్రమాన్ని.

"ప్రియ" ఛానల్ మరో పన్నెండు గంటల్లో రికార్డ్ చేయబోతోంది.

అందులో హీరోతో పాటు ఆరుగురు కాలేజీ అమ్మాయిలు పాల్గొంటారు.

వాళ్లందర్నీ – కాలేజీలో అంతకు ముందు వచ్చిన మార్కుల ప్రాతిపదికపై – నెల క్రితమే "ప్రియ" సెలెక్ట్ చేసింది.

ఆ సెలక్షన్లో – హీరో ఇంతకు ముందు నటించిన చిత్రాలపై "ప్రియ" కొన్ని ప్రశ్నలు సంధించింది.

నిర్దేశించిన సమయంలో సరిగా సమాధానం చెప్పినవారికే – ఆ ఆరుగురిలోనూ స్థానం ఉంటుంది.

అందులో ఒక అమ్మాయి నీరజ – బిఏ ఫైనల్లో కొచ్చింది.

షబ్నమ్ మరో అమ్మాయి – బికాం చేస్తోంది.

మేరీ ఇంకో అమ్మాయి – బిసిఏ చదువుతోంది.

గోదా – కొత్తగా వేరే కాలేజీ నుంచి వచ్చి ఈ మధ్యనే బిబిఎంలో చేరింది.

సంగీత – బిఏ కామర్స్‌లో వుంది.

సాహితి – బిఎస్సీ...

ఈ ఆరుగురు అమ్మాయిలూ రేపటి కార్యక్రమానికి ఎన్నికైన వారిలో ఉన్నారు.

రాత్రి పది గంటలు దాటుతున్నా నీరజకు కంటి మీదికి కునుకు రావటం లేదు.

షబ్నమ్ మనసు ఎందుకో ఆరాటంగా వుంది.

మేరీ సరేసరి – మెతుకు ముట్టలేదు.

గోదా – పక్కపై అటూ యిటూ పిచ్చిగా, అసహనంగా దొర్లుతోంది.

సంగీత – డాబాపై వెన్నెల్లో ఏకాంతంగా ఏవేవో కలల అలల్లో తేలిపోతూ ఆ చివర్నుంచి ఈ చివరికి పచార్లు చేస్తోంది.

సాహితి సరేసరి – కళ్లు పుస్తకాల మీదున్నా – చూపులు మాత్రం కథా నాయకుని చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నాయి.

ఏ ఒక్కరి మనసు తమ అధీనంలో లేదు...

గాభరాగా ఉంది...

ఉత్కంఠగా ఉంది...

ఎప్పుడెప్పుడా అని ఉంది...

ఏదోలా ఉంది...

అభిమాన హీరోని ఏయే ప్రశ్నలడగాలి? ఎలా అడగాలి?..

అసలు అడగటానికి అప్పటి స్థితి కొంచెమైనా సహకరిస్తుందా!...

ఆ మనోహర రూపాన్ని ప్రత్యక్షంగా ఒక్కసారి కనులారా వీక్షించే సరికి – నోరూ మూగ పోతుందేమో...

మంత్రించినట్లు కళ్లు తదేకంగా ఆ రూపంపైనే అలాగే అతుక్కుపోతాయేమో...

చివరికి మౌనమే మిగిలితే...

ఏం చేయాలి?...

ఏమైపోవాలి?...

ఇంతవరకు వెండితెరపైనే కనిపిస్తూ 'హాయ్' అంటోన్న ఆ జగదేక సుందరుడు – చేతితో తాకేటంత దగ్గర్లో కూర్చుంటే అసలు శ్వాస ఆడుతుందా అని...

ఆ శనివారం రాత్రి –

ఆ ఆరుగురిదీ అదే వరస...

అవే ప్రశ్నలు...

రెప్పలపై రంగు రంగుల కలలు.. ఇంద్రధనుసులు...

○ ○ ○

తెల్లవారింది...

ఆ ఆరుగురూ రకరకాలుగా డ్రస్సింగ్ చేసికొన్నారు.

అవన్నీ – ఆ హీరో ప్రక్కన – అంతవరకు నటించిన నాయికలను అనుకరిస్తూ సాగినవే.

ఉదయం తొమ్మిది గంటలకే "ప్రియ" స్టూడియోలో వాళ్లు అడుగుపెట్టారు.

పదీ పదిహేను నిమిషాలకు హీరోతో ముచ్చట్లు మొదలవుతాయి.

తొమ్మిది దాటింది...

తొమ్మిదిన్నర కూడా దాటింది...

తొమ్మిది నలభై అయిదు...

పది...

హీరో – రెండ్రోజుల క్రితమే తాజాగా దిగుమతి చేసుకున్న అందమైన ఫారిన్ కార్లో "ప్రియ"లోకి అడుగుపెట్టాడు.

అంతే...

ఆ ఆరుగురి కళ్ళు ఒక్కసారిగా జిగేల్‌మన్నాయి.

విస్మయం...

తమ అభిమాన కథా నాయకుడతడేనా!...

నమ్మలేని నిజం నరాల్ని తోడేస్తున్న అనుభూతి...

నిర్ణీత సమయానికే కార్యక్రమం చేపట్టటానికి "ప్రియ" సిద్ధంగా ఉంది.

ఏంకర్ "ఏషియా" తల విరబోసుకొని వింత డ్రస్‌తో రంగ ప్రవేశం చేసింది.

ముఖం మీదికి పదే పదే తోసుకొస్తున్న జుత్తును వెనక్కీ ముందుకీ కావాలని సరిచేసికొంటూ తెలుగును ఖూనీచేస్తూ పరిచయ వాక్యాలు పలికింది.

"ముచ్చట్లు మొదలవుతున్నాయి – బి రెడీ..." అంటూ కన్ను గీటింది.

మధ్యలో హీరో – అటూ యిటూ ఇద్దరమ్మాయిలు...

మిగతా నలుగురు ఎదురుగా కూర్చున్నారు.

హీరో అడిగాడు పక్కనే కూర్చున్న అమ్మాయిని "నీ పేరు..."

ఆ అమ్మాయి వెంటనే గొంతు విప్పలేకపోయింది.

"చెప్పండి మేడమ్... సిగ్గా..." హీరో కొంటెగా అన్నాడు.

"సంగీత..." తలొంచుకొని చెప్పింది ఆ అమ్మాయి.

"ఇది పెళ్లి కాదు తలొంచుకోటానికి..." అంటూ ఆ హీరో ఆ అమ్మాయి గడ్డం క్రింద చెయ్యి పెట్టి ముఖంపైకి ఎత్తేడు.

సంగీత సిగ్గుల మొగ్గయింది.

హీరో కర స్పర్శకు శరీరమంతా జల్లుమంది.

"యమ సిన్మా చూశావా..." అడిగాడు హీరో.

తల ఊపింది.

"అందులో నీకేది నచ్చింది?..."

"మీ ఫేస్..." మెల్లగా అంటూ రెప్పవాల్చకుండా ఆ హీరో ముఖంలోకి చూసింది ఆ అమ్మాయి.

ఆ సమాధానం ఆమె నోటి నుండి అప్రయత్నంగా వచ్చిందే తప్ప చెప్పాలని చెప్పింది కాదు.

"థాంక్యూ... అంత బాగున్నానా... మరి నువు చెప్పేది నిజమని నమ్మేదెలా?..."

"ఇంతమందిలో కాదు... అవకాశం కల్పిస్తే చెపుతా..." అన్నట్లుగా ఆ అమ్మాయి కొంటెగా చూసింది.

హీరో మళ్లీ ఈ పక్కనున్న అమ్మాయి వైపు తిరిగాడు.

"నీ పేరు మేనకా..."

"కాదు... మేరి..."

"మేరీ ఏజెంతో తెలుసుకోవచ్చా..."

"మేరేజ్ ఏజే..." అన్నట్లుగా హీరో వంక క్రీగంటితో

చూసింది.

"ఏవిటి అలా చూస్తున్నావ్... కొరుక్కుతినేసేలా..." కథా నాయకుడు అడిగాడు.

ఆ అమ్మాయి చూపు ఆ హీరో మీదే లగ్నమై ఉంది.

"నిన్నే..." అతను నెత్తిమీద సున్నితంగా మొట్టాడు.

మేరీ స్పృహలో కొచ్చింది.

"యమలో నీకే సాంగ్ బావుంది?..."

"నవ్వు నడుంపై చెయ్యేసి... ఇది గగనమా.. అని పాడారే..."

"అదా... అంత బాగా నచ్చిందా... సరే... నువ్వేం చదువుతున్నావ్..."

"... ... ..."

"హలో... నిన్నే..."

"బి.సి.ఏ. ..."

"చదువయ్యాక నువ్వేలాటి జోడీని కోరుకొంటున్నావ్..."

ఆ అమ్మాయి – ముఖంలోంచి ఏదో కోడ్ విసిరింది.

"నాలాటివాడినా..." హీరో ఓరగా చూస్తూ అన్నాడు.

అక్కడ అందరూ గొల్లుమని నవ్వారు.

ఇలాగే మిగతా నలుగురి మధ్య ముచ్చట్లు దొర్లాయి.

ఇంటికొచ్చాక–

ఆ రాత్రి ఆ ఆరుగురూ – కొంచెం అటు యిటూగా పరధ్యానంలోనే గడిపారని చెప్పాలి.

పిలిచినా వినిపించుకోలేని పరిస్థితి వాళ్లని ఆవహించింది.

అభిమాన హీరోతో ముచ్చటించిన అనుభూతి – వాళ్లను ఎక్కడికో తీసుకెళ్లిపోయింది.

"అటువంటి హీరో ప్రియుడయితే..." అన్న ఆశ వాళ్లను వెంటాడ సాగింది.

తమ ఉనికిని తామే కోల్పోయేలా చేసింది – ఆనాటి "ప్రియ"మైన సన్నివేశం.

కోడెవయసు మరింత రెచ్చకొట్టింది – "ప్రియ" రేపిన తుపాను వాతావరణంతో.

చిలిపి ఊహలు క్రమంగా – పీల్చేగాలిని సైతం వేడెక్కించసాగాయి.

○ ○ ○

కాలేజీలో బాగా చదివే ఆ ఆరుగురు అమ్మాయిల్లోనూ – ఇద్దరు పరీక్షలలో ఎందుకు ఫెయిల్ అయ్యారో యాజమాన్యానికి ఎంత గింజుకొన్నా అర్థంకాలేదు.నలుగురు మరీ తక్కువ మార్కులతో ప్యాసు కావటం గుడ్డిలో మెల్ల అనిపించినా ఎంతో పేరున్న ఆ కాలేజీకి అప్రతిష్ఠ అనిపించింది.

"పరీక్ష హాల్లోకి రాగానే విపరీతంగా తలనొప్పి వచ్చింది... రాయలేక పోయాను..." అంటూ ఒక అమ్మాయి చెప్పింది.

"అన్నీ తెలిసినవే... అయినా పెన్ ముందుకు కదల్లేదు..." అంటూ మరో అమ్మాయి చెప్పింది.

ఆ ఆరుగురూ అలా ఏవేవో కారణాలు చెపుతూ వచ్చారు.

దీనిపై కాలేజీ ఓ కమిటీని వేసింది.

మూడు నెలలు గడిచాక కమిటీ ఒక రిపోర్ట్ ఇచ్చింది.

దాని సారాంశం ఇది–

"ప్రసార మాధ్యమాలలో కొన్ని కొన్ని కార్యక్రమాల్ని నియంత్రించకపోతే రేపు వెలగవలసిన దీపాలు ఇలాగే మిణుకు మిణుకుమంటాయి..." ■

# చైతన్య

–మాధవరపు కృష్ణ

రంగారావు ఇంచుమించు ప్రతీ ఆదివారం నీచుకూరతో భోంచేస్తాడు. ఆదివారం ఉదయం తనే స్వయంగా కొత్తపేట మార్కెట్టుకు వెళ్ళి తనకు నచ్చిన సముద్రపు చేప లేక ముదురు చేప ముక్కల వాటా కొని తెచ్చుకుంటాడు. సముద్ర చేపల్లో కర్రీ కింగులైన పండుగప్ప వంజరం మాఘ తెల్లసందువ తెల్ల సొర్ర తంబరొట్ట ముదర సావిడి రకాల పట్ల మంచి అనుభవం ఉంది. అమ్మేవాళ్ళు ఇదే అదని రంగారావుని మోసం చెయ్యలేరు. నెమలి గువ్వ పావురం, గులకన కోడి మొదలైన పిట్ట మాంసాల రుచి కూడా తెలుసు.

ఆ ఆదివారం బద్ధకించిన రంగారావు కూర పని ఏకైక పుత్రరత్నం టెన్త్ స్టూడెంటైన చైతన్య కప్పగించి, "ఒరేయ్! చెప్పింది బుర్రలో పెట్టుకో. ప్రస్తుతం చేపల్ని అయిసులో ఉంచి అమ్ముతున్నారు. అందువల్ల చేప గట్టిగా ఉన్నా పాడై ఉండొచ్చు. అప్పుడు శంకు (మొప్ప) ఎత్తి చూస్తే పరిస్థితి తెల్సిపోతుంది. శంకు నల్లగా ఉంటే కొనకు. ఎర్రగా ఉంటే అప్పుడు రేటు అడిగి చెప్పిన ఖరీదులో సగానికి అడుగు. అలాగే గొరసని పండు గప్పని నల్ల సొర్ర తెల్లదని నల్ల సందువా తెల్లదని అంటగట్ట బోతారు జాగ్రత్త. అసలైన పండు గప్ప బంగారు ఛాయతో అరచేయి వెడల్పుతో పొడవుగా ఉంటుంది. గొరస పేరుకి తగ్గట్టుగానే పొట్టిగా చేట వెడల్పులో ఉంటుంది. మాఘ కత్తిలాగుంటుంది." అన అనుభవ సారాన్ని ఏకరువు పెట్టేక వంద నోటిచ్చి పంపించాడు.

చైతన్య ఒకటి రెండుసార్లు తండ్రి వెంట వెళ్ళిన చిరు అనుభవం ఉంది, కాని ఒక్కడుగా వెళ్ళడం ఇదే ప్రథమం.

రంగారావు కొడుకుని చాలా భారీ క్రమశిక్షణలో పెంచుకొచ్చాడు. అతడు గీచిన గీటు అతడి అర్ధాంగే కాదు చైతన్య కూడా దాటేందుకు సాహసించరు. అంతటి ఛండశాసనుడా తండ్రి! ఒక విధంగా వారి స్వేచ్ఛని తన గుప్పిట పెట్టుకున్నాడు అంటే ఒప్పదు. దానికి క్రమశిక్షణ పంచదార పూత పెడతాడు.

రంగారావు పేపరులో ముందు సంచలన వార్తలు తదుపరి క్రీడా విషయాలు అనంతరం రాష్ట్ర రాష్ట్రేతర సంగతులు చదవడం అయ్యేక టైం చూసి చైతన్య వెళ్ళి గంట దాటిందని గుణించుకున్నాడు.

ఈ పాటికి వెళ్ళిన వెధవ కూరతో గానీ ఉత్త చేతుల్తో గానీ తగలడాలి. రాలేదంటే ఏదో జరిగుండాలి. ఇచ్చిన వంద పారేసాడా? లేక పిల్లల్తో కలిసి అయిసుక్రీం తినేసి, విడియోగేమ్స్ ఆడేశాడా? రంగారావుతో సవాలక్ష అనుమానాలు శంకలు పెల్లుబికాయి.

ఆ టెన్షను సమయంలో చైతన్య ఖాళీ సంచితో రావడం చూసి 'కుర్ర సన్నాసికి చేపలు బేరం కుదరక రిక్త హస్తాలతో వేంచేశాడు. ఇదీ ఒకందుకు మంచిదే." తలుస్తూ బిత్తరి చూపుల్తో నిలబడ్డ కొడుకుని పరిశీలించిన రంగారావు మదిలో తన అనుమానం నిజమయిందా? అంటే బిళ్ళకుడుంలాంటి వంద నోటు పారేశాడా?.. అదే జరిగుంటుంది. అందుకే అలా ఉన్నాడు అని ఊహిస్తూ కడకి భరించలేక "వందేదిరా ఇలా ఇవ్వు" గట్టిగా అరిచాడు. ఆ కేకకి కిచెన్లోంచి రంగారావు అర్ధాంగి వెంకట లక్ష్మి హాల్లోకొచ్చింది.

ఉలుకు పలుకు లేకుండా ఉన్న చైతన్యని 'పారేసావా? పింజారీ ఖర్చులు చేసేశావా? ఏం చేశావో చెప్పి అఘోరించు.' రంగారావు మళ్ళీ నోరు చించుకున్నాడు. అప్పటికీ చైతన్య తీరులో మార్పు రాకపోయేసరికి రంగారావులో ఎస్వీఆర్ విజృంభించాడు.

"గూబ గుంయ్ మనిపిస్తేగానీ నువ్వు నోరిప్పవు" అంటూ కొట్టేందుకు రంగారావు చేతినెత్తాడు.

"ఒరేయ్. రంగా! ఆగరా!" గావుకేకతో రంగారావు అనుంగు మిత్రుడు రామారావు బైట నుంచి గబగబా లోపలికి వచ్చి చైతన్యని ప్రేమగా దగ్గరకి తీసుకున్నాడు.

"వీడు చేసిన అప్రాచ్యపు పనేమిటో చెప్పి చావడం లేదు" రంగారావు.

"నీ కొడుకు పదిమంది మెచ్చే నచ్చేది చేసి శహభాష్ అనిపించుకున్నాడు" రా రా.

"దానాధర్మం చేశాడా బజార్లో?" రంగారావు, వెంకట లక్ష్మిది ప్రేక్షక పాత్ర.

"కొత్తపేట యావత్తు మార్కెట్టు ముక్కున వేలేసు కుందిరా!" రామారావు.

"ఇంతకీ అక్కడేం జరిగిందో చెప్పండన్నయ్యగారూ!" వెంకటలక్ష్మి సస్పెన్స్ భరించలేక సమాప్తి పలకమంది.

రామారావు చైతన్య తల నిమురుతూ, "ఈ ఉదయం కూర కోసం మార్కెట్టుకి వెళ్లాను. మార్కెట్ ప్రారంభంలో వీడు జత పావురాల్ని బేరమాడుతున్నాడు. పిట్ట మాంసం మీదకి వీడికి మనసు పోయిందేమిటి చెప్మా అనుకునేలోగా బేరం కుదిరింది గాబోలు అమ్మిన వాడికి వందిచ్చేసాడు.." మధ్యలో రంగారావు "పావురాలేవి?" ఆత్రంగా ప్రశ్నించాడు.

"ఇంకెక్కడి పావురాలు?" రామారావు.

"ఏం చేశాడు?" రంగారావు

"వదిలేశాడు. రివ్వున ఆకాశంలోకెగిరిపోయాయి" రామారావు. ■

## బరువు చేటు

నడుస్తూ... నడుస్తూ..
వెనుదిరగకు!
వెనుతిరిగేవాడికి
భవిష్యత్తుండదు!!
మాట్లాడుతూ.. మాట్లాడుతూ
నీళ్ళు నమలకు!
నీళ్ళు నమిలేవాడి దగ్గర
నిజం నిలవదు!!
చూస్తూ... చూస్తూ
చూపుల్ని మళ్ళించకు!
తప్పించుకునే వాడెప్పుడూ
తప్పు చేసేవాడే!!
బతుకుతూ.. బతుకుతూ..
చచ్చుగా మిగలకు!
బతికి చచ్చే సజీవచ్ఛవం
దేశానికి బరువు చేటు

–గరిమెళ్ళ నాగేశ్వరరావు